సాక్షి
రంగారెడ్డి
గురువారం । 18 । ఏప్రిల్ । 2024



సమాజ శ్రేయస్సుకు..

సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని డాక్టర్ పురుషోత్తమ్‌రెడ్డి, సాత్వికరెడ్డి అన్నారు. 8లో▸



నిఘా సున్నా!

హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ ప్రతిష్ట ఇటీవల వెలుగులోకి వస్తున్న వివాదాస్పద అంశాలతో మసకబారుతోంది. 8లో▸



ఓయూలో 'టెక్నోస్మానియా'

ఓయూలో టెక్నాలజీ కాలేజీ విద్యార్థులు టెక్నోస్మానియా–2024 జాతీయ స్థాయి టెక్నోకల్చరల్ ఫెస్ట్ నిర్వహించారు. 8లో▸

న్యూస్‌రీల్

శ్రీరామ నవమి వేడుకల్లో కేంద్ర మంత్రి

- సతీసమేతంగా హాజరైన కిషన్‌రెడ్డి
- స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పణ



తిమ్మాపూర్‌లో కల్యాణానికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న కిషన్‌రెడ్డి దంపతులు

కందుకూరు: మండల పరిధిలోని తిమ్మాపూర్ రామాలయంలో బుధవారం నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. స్వామి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ మంద జ్యోతిపాండు, నాయకులు అమరేందర్‌రెడ్డి, నిరంజన్, భిక్షపతి, పాండు, రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా విజయ్‌కుమార్



ఇబ్రహీంపట్నం రూరల్: భారతీయ జనతాపార్టీ యువ మోర్చా జిల్లా కార్యదర్శిగా మైలారం విజయకుమార్ నియమితులయ్యారు. బీజేవైఎం రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడు యాదీష్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండల కేంద్రానికి చెందిన విజయ్‌కుమార్ బీజేపీలో చురుకైనపాత్ర పోషించారు. పార్టీ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తించిన అధిష్టానం కార్యదర్శిగా నియమించింది. ఈ సందర్భంగా ఆయన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

కాలుష్యకారకాలపై చర్యలు

రాష్ట్ర పర్యావరణ నియంత్రణ బోర్డు మెంబర్ సత్యనారాయణరెడ్డి



సత్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న బోర్డు కమిటీ సెక్రటరీ, సభ్యులు

చేవెళ్ల: ప్రజలకు ఇబ్బంది కలిగించే కాలుష్యకారకాలపై తెలంగాణ రాష్ట్ర పర్యావరణ నియంత్రణ బోర్డు ఆధ్వర్యంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బోర్డు సెక్రటరీ బుద్ధ ప్రసాద్ ఐఏఎస్ అధ్యక్షతన నగరంలో బోర్డు సభ్యుల సమావేశం నిర్వహించారని.. చేవెళ్ల ప్రాంతంలోని పలు సమస్యలను బోర్డు దృష్టికి తీసుకెళ్లామన్నారు. తాండూరులోని ఏసియన్ బ్రౌన్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే కాలుష్యంతో గ్రామస్తులు, విద్యార్థులు ఇబ్బందులు గురవుతున్నారని.. చందనవెల్లిలోని కుందన్ టెక్స్‌టైల్స్, శంషాబాద్ శ్రీకృష్ణ డ్రగ్స్‌తోనూ పర్యావరణం కాలుష్యమవుతోందని చెప్పానన్నారు. మోకిలలో నిర్మిస్తున్న విల్లాలు, అపార్ట్‌మెంట్‌ల నిర్మాణ వ్యర్థాలు గండిపేట చెరువులోకి వదులుతున్నారని ప్రస్తావించానన్నారు. మోకిలలోని నిర్మాణాలను సందర్శించి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు బోర్డు నిర్ణయించిందని చెప్పారు. మొదటిసారి సమావేశానికి హాజరైన నూతన మెంబర్లను బోర్డు ఆధ్వర్యంలో సన్మానించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పీసీబీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డూప్లికేట్ ఔట్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో వివిధ కేటగిరీల కింద 5,41,201 ఓట్లను అధికారులు తొలగించారు. జిల్లా పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 54,259 మంది డూప్లికేట్ ఓటర్లతో పాటు మరణించిన ఓటర్లు, చిరునామా మారిన వారు వీరిలో ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ ప్రకటించారు. మహానగరంలో ఓటర్లకు మించి ఎక్కువ ఓట్లున్నట్లు ఎంతోకాలంగా విమర్శలున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు. ఒకే అసెంబ్లీ నియోజకవర్గంలో వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఓట్లున్నవారితోపాటు వేర్వేరు నియోజకవర్గాల్లోనూ ఓట్లుండటాన్ని రాజకీయపార్టీలు పలు సందర్భాల్లో ప్రస్తావించాయి. ఇలాంటి డూప్లికేట్ ఓటర్ల గురించి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా డూప్లికేట్ ఓటర్లను గుర్తించే చర్యలు చేపట్టిన జిల్లా ఎన్నికల యంత్రాంగం గత సంవత్సరం ఆరంభం నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు గుర్తించిన డూప్లికేట్లను తొలగించింది.



కడ్తాల్: కల్యాణోత్సవంలో తలంబ్రాల ఘట్టం



షాద్‌నగర్ రూరల్: జానంపేట వేంకటేశ్వరాలయంలో కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్త జనం



యాచారం: నల్లవెల్లిలో పూజలందుకున్న ఉత్సవ మూర్తులు

కల్యాణం.. మురిసిన భక్తజనం

శ్రీరామ నవమి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే ఆలయాలకు బారులు తీరారు. వేదపండితులు శ్రీ సీతారామ సమేత లక్ష్మణ హనుమంతుల వారి ఉత్సవ విగ్రహాలకు వైభవంగా పూజలు చేశారు. కన్నుల పండువగా కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం ఆలయాల్లో, పట్టణ కూడళ్లలో పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం నిర్వహించిన శోభాయాత్రల్లో యువత పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. – సాక్షి, నెట్‌వర్క్



షాద్‌నగర్: శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎన్నికలకు సై

నేడే లోక్‌సభ ఎలక్షన్ నోటిఫికేషన్

- ఆ వెంటనే నామినపన్ల స్వీకరణ
- 18, 19, 24 తేదీల్లో శుభ ముహూర్తాలు
- నామినేషన్ల దాఖలుకు అభ్యర్థుల ఏర్పాట్లు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: సార్వత్రిక ఘట్టానికి సర్వం సిద్ధమైంది. లోక్‌సభ ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ వెలువడనుంది. ప్రధాన పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించగా.. అధికార యంత్రాంగం ఆ మేరకు ఏర్పాట్లలో తలమునకలైంది. ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకం, ఓటర్లను ప్రభావితం చేసే నగదు, మద్యం పంపిణీ వంటి అంశాలపై గట్టి నిఘా తదితర చర్యలు చేపట్టింది. ఓటింగ్ శాతం పెంచేందుకు ఏర్పాట్లు చేస్తుంది. యువత, మహిళలు, వృద్ధులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తుంది. మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే రిటర్నింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ల దాఖలు కోసం మంచి ముహూర్తాలను అన్వేశిస్తున్నారు. ఇప్పటికే పంతుళ్లను ఆశ్రయించి, ఏ రోజు నామినేషన్ వేయాలనే అంశంపై ఓ అంచనాకు వచ్చినట్లు తెలిసింది.

శుభ ముహూర్తాలు

- 18వ తేదీ గురువారం దశమి, మగ నక్షత్రం మంచి రోజు కావడంతో అభ్యర్థులు సాదాసీదాగా వెళ్లి నామినేషన్లు వేసే అవకాశం ఉంది.
- 19న శుక్రవారం, ఏకాదశి, ముఖ నక్షత్రం మొదటి రోజుతో పోలిస్తే రెండో రోజే నామినేషన్లు వేసేందుకు మెజార్టీ అభ్యర్థులు మొగ్గు చూపుతున్నారు.
- 24న బుధవారం చైత్ర బహుళ పాడ్యమితో పాటు స్వాతి నక్షత్రం, చాలా బాగుంది. ఈ రోజు నామినేషన్లు సమర్పిస్తే.. అంతా మంచి జరుగుతుందనే నమ్మకం ఉంది.
- 22 సోమవారం చతుర్థశి, అష్టానక్షత్రం. నామినేషన్ల దాఖలుకు మంచి రోజు.
- 21న ఆదివారం త్రయోదశి, ఉత్తర నక్షత్రం.. పై ముహూర్తాల కంటే ఇది యోగ్యమైనది. కానీ ఆరోజు సెలవు కావడంతో అభ్యర్థులు ముందు రోజుల్లోనే నామినేషన్లు దాఖలు చేయాల్సి వస్తుంది.
- గతంలో నామినేషన్ల కార్యక్రమం చాలా అట్టహాసంగా చేసే వారు. భారీగా జనాన్ని సమీకరించి, ర్యాలీగా వెళ్లి నామినేషన్లు వేసే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఎండలు భగ్గున మండుతుండటంతో పార్టీ శ్రేణులు సైతం బయటికి వెళ్లేందుకు జంకుతున్నాయి. ఈ నేపథ్యంలో సాదాసీదాగా నామినేషన్లు వేసే అవకాశం ఉంది.

నామినేషన్ల దాఖలు ఇలా

- అభ్యర్థులు నామినేషన్ ఫారం–2ఎను రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి ఉచితంగా పొందవచ్చు.
- ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేసుకునే అవకాశం ఉంది.
- అభ్యర్థి వెంట మరో నలుగురికి మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతి.
- జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులకు వారు పోటీ చేస్తున్న నియోజకవర్గంలోని ఒక ఓటరు నామినేషన్‌ను ప్రతిపాదించాలి.
- అదే రిజిస్టర్ రాజకీయ పార్టీలు/ స్వతంత్ర అభ్యర్థులకు పది మంది ఓటర్లు నామినేషన్‌ను ప్రతిపాదించాల్సి ఉంది.
- అభ్యర్థులు మూడు నెలల లోపు దిగిన ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటో అఫిడవిట్‌పై అతికించాలి.
- నామినేషన్ పత్రంపై స్టాంప్ సైజు ఫొటో పెట్టాలి.
- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వేరే పార్లమెంట్ సెగ్మెంట్‌కు చెందిన వారైతే విధిగా వారి అసెంబ్లీ సెగ్మెంట్ వీఆర్ఓ నుంచి ఓటరు ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంది.
- రిజిస్టర్/ గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ ఫారంలోని పార్ట్–3లో సి కాలం ఎదుట ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తుల్లో ఏదైనా మూడు గుర్తులను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసి, ఆ వివరాలను పొందుపరచాలి.
- పోటీ చేసే అభ్యర్థులు ప్రత్యేకంగా బ్యాంక్ అకౌంట్ తీసుకోవాలి.
- అభ్యర్థులు గరిష్టంగా రూ.95 లక్షలు ఖర్చు చేసేందుకు అనుమతి.
- ఎన్నికల వ్యయానికి సంబంధించిన లావాదేవీల నిర్వహణ పక్కాగా నిర్వహించాలి.

నామినేషన్ల స్వీకరణ కోసం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు, భద్రత కోసం చేవెళ్లలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీని ఎంపిక చేశారు. మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాలు చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో మొత్తం 29,28,186 మంది ఓటర్లు ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. మొత్తం 2,877 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అదే విధంగా ఎన్నికల నిర్వహణకు 13,443 పోలింగ్ సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.

షెడ్యూల్ ఇలా..

- మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఏప్రిల్ 18న నోటిఫికేషన్
- ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల స్వీకరణ
- సెలవు రోజుల్లో నామినేషన్లు స్వీకరించరు.
- ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన
- ఏప్రిల్ 29న ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా విడుదల
- మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి
- జూన్ 6తో ఎన్నికల ప్రక్రియ ముగింపు

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం

పార్టీ	అభ్యర్థి	నామినేషన్ వేయనున్న తేదీ
బీఆర్ఎస్	కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్	19
బీజేపీ	కొండా విశ్వేశ్వర్‌రెడ్డి	22
కాంగ్రెస్	గడ్డం రంజిత్‌రెడ్డి	25

డోర్ నంబర్లా డొల్లే!

- నగర ఓటరు జాబితాలో వింతలెన్నో
- రెండేళ్లుగా సరిదిద్దుతున్న యంత్రాంగం



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో ఒకే ఇంట్లో వందల సంఖ్యలో ఓట్లున్న చిత్రాలు తెలుసు. ఇది ఎలా సాధ్యం ? అంటే ఇష్టానుసారం డోర్ నంబర్లతో ఓటరు జాబితాలో పేరు చేరిపోవడం ఒక కారణం. ఒక ప్రాంతంలోని వారందరూ ఓటరుగా నమోదయ్యేటప్పుడు తమ సమీపంలోని వారు ఇచ్చిన డోర్ నంబర్‌తోనే తమ పేర్లు కూడా నమోదు చేసుకున్న వారున్నారు. ఒక పెద్ద భవనంలోని అద్దెదారులందరూ కూడా ఒకే డోర్ నంబర్‌తో ఓటర్లుగా నమోదైన వారున్నారు. అంతే కాదు ఇంకొందరైతే జీహెచ్ఎంసీ కేటాయించిన ఇంటినెంబరు కాకుండా తమ ఇష్టానుసారం డోర్ నంబర్లను వేసిన వారున్నారు. ఒక ఇంటినంబరుకే అదనంగా చివరన ఎ,బి,సిలు చేర్చడమో లేక బై నంబర్లు వేయడమో చేసి ఆ ఇంటి నంబరుతోనే ఓటరుగా నమోదయ్యారు. సంబంధిత అధికార యంత్రాంగం సైతం ఆన్‌లైన్‌లోనమోదు చేసుకున్నప్పటికీ, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు తీసుకున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడం కూడా ఇందుకు కారణమనే ఆరోపణలున్నాయి. ఎట్టకేలకు దిద్దుబాటు చర్యలకు సిద్ధమైన యంత్రాంగం గత రెండేళ్లుగా 2022 మార్చి నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు 1,81,405 మంది ఓటర్లు ఇలాంటి ఇంటినంబర్లతో ఓటర్లుగా ఉన్నట్లు గుర్తించారు.వారిని స్టాండర్డ్ ఇంటినంబర్లలో లేనివారుగా పేర్కొంటున్నారు. అలాంటి వారిని గుర్తించి సరిచేసినట్లు పేర్కొన్నారు.

ఒకే కుటుంబం.. కేంద్రాలు అనేకం!

- నగరంలో వింత పరిస్థితి
- పోలింగ్ శాతం తగ్గుదలకు ఇదీ ఓ కారణం



సాక్షి, సిటీబ్యూరో: ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన ఓ కుటుంబంలో భార్యాభర్తలతో పాటు వారిద్దరి పిల్లలకు ఓటు హక్కు ఉంది. అందరి పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటేసేందుకు అందరూ కలిసి వెళ్లవచ్చులే అనుకున్నారు.అందరూ ఒకేసారి వెళ్లి, రావచ్చుననుకున్నారు. అందుకు ఒక ఆటోలో వెళ్తే సరిపోతుంది అనుకుంది ఆ మధ్య తరగతి కుటుంబం. ఇంటింటికి వచ్చి ఇచ్చిన పోల్ స్లిప్ చూస్తే కుటుంబంలోని భర్తకు ఒక పోలింగ్ కేంద్రం, భార్యకు మరో పోలింగ్ కేంద్రంలో ఓటు ఉన్నట్లు గుర్తించారు. పిల్లలిద్దరికీ ఒకే లొకేషన్ రావడం కొంతలో కొంత నయం. లొకేషన్ ఒకటే అయినా వారి పోలింగ్ కేంద్రాలు కూడా వేరే. దీంతో పిల్లలిద్దరు మాత్రం పోలింగ్ బూత్‌దాకా వెళ్లి ఓటేసినా.. భార్యాభర్తలకు చెరో చోట రావడంతో వారు వెళ్లలేదు.ఒక్కొక్కరు ఒక్కో వాహనం సమకూర్చుకోలేకపోవడంతోపాటు కలిసి వెళ్లలేక పోతున్నామనే తలంపుతోనూ వారు ఓటేసేందుకు ఉత్సాహం చూపలేదు. ఇది ఒక్క నియోజకవర్గంలోని ఒక్క కుటుంబం పరిస్థితి మాత్రమే కాదు. ఇలా ఒకే కుటుంబంలోని సభ్యులకు వేర్వేరు ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు ఉంటోంది. నగరంలో పోలింగ్ శాతం తగ్గడానికి ఇదీ ఓ కారణం. ఇలా ఎందుకవుతుందో అంతుపట్టలేదు. పోలింగ్ శాతం తగ్గేందుకు ఇదీ ఓ కారణంగా గుర్తించిన జిల్లా ఎన్నికల యంత్రాంగం ఈ పరిస్థితిని చక్కదిద్దే చర్యలకు ఉపక్రమించింది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2023 మే నుంచి నవంబర్ మధ్య ఇలా ఒకే కుటుంబానికి చెందినప్పటికీ వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉన్న 3,60,849 మంది ఓటర్లను కుటుంబమంతటికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓట్లుండే చర్యలు చేపట్టింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత సైతం ఈ ప్రక్రియను కొనసాగించింది. 2024 మార్చి నెలాఖరు వరకు అలా 17,864 మంది ఒకే కుటుంబ ఓటర్లకు ఒకే పోలింగ్ కేంద్రం ఉండేలా చర్యలు తీసుకుంది. వెరసి మొత్తం 3,78,713 మంది ఓటర్లకు ఒక కుటుంబంలోని వారు ఒకే చోట ఓటు వేసేలా చర్యలు తీసుకున్నారు.

నేనే చంపేశా..

- డబ్బుల విషయంలో గొడవ
- గొడ్డలితో దాడి చేసి మేన బావను హతమార్చిన నిందితుడు

చేవెళ్ల: రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా తనకు ఇస్తానన్న డబ్బులు ఇవ్వకపోవడంతో మేన బావను హతమార్చాడు ఓ వ్యక్తి. ఈ సంఘటన ఊరేళ్ల సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం.. చేవెళ్లకు చెందిన కడమంచి నారాయణదాస్(46) జాతీయ అంబేడ్కర్ అవార్డు గ్రహీత, రియల్ వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. ఇతనికి ఊరేళ్ల సమీపంలో ఓ ఫాంహౌస్ ఉంది. కొద్ది రోజులుగా ఇందులో మరమ్మతు పనులు చేయిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం తన మేన బావమర్ది తూర్పాటి భాస్కర్‌తో కలిసి ఫాంహౌస్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పాడు. చీకటి పడినా రాకపోవడంతో మృతుడి భార్య పలుమార్లు ఫోన్ చేసింది. ప్రతీసారి లిఫ్ట్ చేసిన భాస్కర్.. బావ దూరంగా ఉన్నాడని చెప్పాడు. అర్ధరాత్రి తర్వాత చేవెళ్ల పీఎస్‌కు వెళ్లిన భాస్కర్.. నారాయణదాస్‌ను గొడ్డలితో నరికి చంపానని చెప్పి లొంగిపోయాడు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి చూసే వరకు నారాయణదాస్ రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉన్నాడు. ఈ విషయాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు తెలిజేశారు. మృతుడికి భార్య మాణెమ్మ, ఇద్దరు కుమారులున్నారు.

డబ్బులు ఇవ్వకపోవడంతోనే..

రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే నారాయణదాస్ చాన్నాళ్లుగా భాస్కర్‌ను తన వెంట తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో షాబాద్ మండలం నాగరకుంటలోని ఓ భూమికి సంబంధించిన డీల్‌లో రూ.25లక్షలు ఇస్తానని భాస్కర్‌కు చెప్పాడు. ఇది పూర్తయి చాలా రోజులైనా డబ్బు ఇవ్వకుండా దాటవేస్తున్నాడు. దీంతో కొద్ది రోజులుగా భాస్కర్ అతనికి దూరంగా ఉంటున్నాడు.



మృతుడు నారాయణదాస్ (ఫైల్)

మంగళవారం డబ్బు అడగ్గా ఇస్తాలే నేనెక్కడికి వెళ్లట్లేదుగా అని చెప్పిన నారాయణదాస్.. భాస్కర్‌ను తీసుకుని ఊరెళ్లలోని ఫాంహౌస్‌కు వెళ్లాడు. ఇద్దరూ కలిసి అక్కడే మద్యం తాగారు. ఈ క్రమంలో డబ్బుల విషయం మరోసారి చర్చకు రావడంతో ఒకరినొకరు తోసుకున్నారు. ఈ సమయంలో కింద పడిపోయిన నారాయణదాస్ లేస్తే తనను చంపేస్తాడని భావించిన భాస్కర్ అక్కడే ఉన్న గొడ్డలితో మెడపై దాడి చేశాడు. అతడు చనిపోయాడని నిర్ధయించుకుని ఠాణాకు వెళ్లి లొంగిపోయాడు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

హత్యపై అనుమానాలు

నారాయణదాస్ హత్య ఒక్కడివల్ల జరగలేదని, దీనిపై నిజానిజాలు తేల్చాలని మృతుడి కుటుంబ సభ్యులు కోరారు. దీంతో మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి అక్కడే పోస్టుమార్టం, ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సమాజానికి ఉపయోగపడేలా పరిశోధనలు

- చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ పురుషోత్తమ్‌రెడ్డి


భార్గవికి పట్టాను అందజేస్తున్న యూనివర్సిటీ చాన్స్‌లర్ పురుషోత్తమ్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: ప్రస్తుత కాలంలో సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ పురుషోత్తమ్‌రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సాత్వికరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ సమీపంలో గల యూనివర్సిటీలో భార్గవి, ప్రశాంత్‌రాజులు డాక్టరేట్ పొందారు. సూక్ష్మ జీవశాస్త్ర విభాగంలో 'ఎవాల్యూవేషన్ ఆఫ్ యాంటీ బ్యాక్టీరియా ఎండీ యాంటీ బయోఫిల్మ్ పొటెన్షియల్ ఆఫ్ సెలెక్టెడ్ ప్లాంటీ ఎక్స్‌లెన్స్ ఎగ్రినేస్ట్ డిగ్రీ రెసిస్టెంట్ పాతోజేన్స్' అనే అంశంపై ప్రొఫెసర్ బి.శ్రీలత పర్యవేక్షణలో భార్గవి పరిశోధన చేశారు. అదే విధంగా రసాయన శాస్త్ర విభాగంలో 'సింథాసిస్ అండ్ బయోలాజికల్ ఎలివేషన్ ఆఫ్ నైట్రోజన్ బెస్ట్ ఎటిరో సక్లిస్ట్' అనే అంశంపై ప్రొఫెసర్ జగదీష్‌కుమార్ పర్యవేక్షణలో ప్రశాంత్‌రాజ్ పరిశోధన చేశారు. ఈ సందర్భంగా వీరికి డాక్టరేట్ పట్టాను అందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రవీందర్, కవిత, రిసర్చ్ డీన్ కిష్టఫర్, డిన్ సైన్స్ ప్రొఫెసర్ సుందర్‌రామ్, అడ్మినిస్ట్రేషన్ రాజు, పబ్లిక్ రిలేషన్ అధికారి రాంబాబు పాల్గొన్నారు.

సివిల్స్‌లో గిరి పుత్రుడి సత్తా

అఖిల భారత సర్వీసుల్లో ఉద్యోగం సాధించాలని ఎందరో కలలు కంటారు. దానికి నిర్దిష్టమైన ప్రణాళిక రచించి, కఠోర సాధన చేస్తే తప్ప అందుకోవడం సాధ్యం కాదు. అలాంటి కలను షాద్‌నగర్‌వాసి సాకారం చేసుకున్నాడు. ఇటీవల వెల్లడించిన సివిల్స్ ఫలితాల్లో సత్తా చాటాడు.

షాద్‌నగర్‌వాసికి 891వ ర్యాంకు


కొర్రావత్ శశికాంత్

షాద్‌నగర్: అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) నిర్వహించిన సివిల్స్ ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ వాసి సత్తా చాటాడు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో 891వ ర్యాంకుతో మెరిశాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మాచారం గ్రామ పరిధిలో చాకలిదాని తండాకు చెందిన రాములు నాయక్, సీతమ్మ దంపతుల పెద్దకుమారుడు శశికాంత్. తండ్రి రాములు నాయక్ హాస్టల్‌లో వార్డెన్‌గా పని చేస్తూ షాద్‌నగర్ పట్టణంలోని విజయ్‌నగర్ కాలనీలో స్థిరనివాసం ఏర్పర్చుకున్నారు. ఆయన 2008లో అకస్మాత్తుగా మృతి చెందడంతో అప్పటి నుంచి తల్లి పిల్లలను చదివిస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. శశికాంత్ షాద్‌నగర్ పట్టణంలోని మరియారాణి ఉన్నత పాఠశాలలో 1 నుంచి 8వ తరగతి వరకు విద్యాభ్యాసం చేశారు. ఆ తర్వాత నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెం నవోదయలో 9, 10వ తరగతులు చదివారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని మియాపూర్ గుంటూరు వికాస్‌లో ఇంటర్, విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్(ఈఈఈ) పూర్తి చేశారు.

పట్టువదలని విక్రమార్కుడిలా..

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలి, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగిన శశికాంత్ ఎన్ని ఉద్యోగాలు వచ్చినా వాటిని వదలుకున్నారు. 2011లో ఇన్ఫోసిస్‌లో ఏడాదికి రూ.11లక్షల ప్యాకేజీతో, 2012లో పశ్చిమ బెంగాల్‌లో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాలో ఏటా రూ.12లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. అయినా వాటిల్లో చేరకుండా సివిల్స్ వైపు దృష్టి మళ్లించారు. 2013లో ఢిల్లీ వెళ్లి సివిల్స్‌కు సిద్ధం అయ్యారు. మూడుసార్లు ప్రిలిమినరీ వరకు వచ్చారు. 2019లో కేవలం 6 మార్కుల తేడాతో అవకాశం కోల్పోయారు. 2020లో ఆరో ప్రయత్నంలో సివిల్స్‌లో 695 ర్యాంకు సాధించిన శశికాంత్‌ను యూపీఎస్సీ అధికారులు ఐఆర్‌టీఎస్ (ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్)కు కేటాయించారు. ప్రస్తుతం అస్సాంలో రైల్వేశాఖలో పని చేస్తున్నారు.

చదువుతూ.. ఉద్యోగం చేస్తూ

అస్సాం రాష్ట్రంలోని రింగియా డివిజన్‌లో రైల్వే విభాగంలో అసిస్టెంట్ ఆపరేషన్ మేనేజర్‌గా శశికాంత్ విధులు నిర్వర్తిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖలో విధులు నిర్వర్తిస్తూనే మరోసారి సివిల్స్‌కు ప్రయత్నించారు. ఇప్పటి వరకు 8సార్లు పరీక్షలు రాసిన శశికాంత్ మూడు సార్లు ర్యాంకులు సాధించారు. ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్స్ సర్వీసెస్ తుది పరీక్ష ఫలితాలు మంగళవారం వెల్లడించింది. మొత్తం 1,016 మందిని ఎంపిక చేయగా శశికాంత్ 891వ ర్యాంకు సాధించి శెభాష్ అనిపించుకున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

మొయినాబాద్: ఆరుబయట బాత్‌రూంకు వెళ్లిన వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం మండలం, రాఘవరెడ్డి కాలనీకి చెందిన అతిపాటి ఆదిశేషయ్య కొంత కాలంగా మండల పరిధిలోని చిన్నషాపూర్ గేటు సమీపంలో ఉంటున్నాడు. అతని సోదరుడి కూతురు లావణ్య(18) పది రోజుల క్రితం ఆదిశేషయ్య ఇంటికి వచ్చింది. బుధవారం ఉదయం 6.30 గంటల సమయంలో బాత్‌రూంకు వెళ్తానని ఇంటి నుంచి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో మొయినాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. నెల్లూరు జిల్లా రాఘవరెడ్డి కాలనీకి చెందిన ప్రసాద్ అనే యువకుడిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

షాద్‌నగర్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కందివనం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్ జిల్లాకు చెందిన సిద్ధార్థ తుకారాం కడేకర్(24) కుటుంబంతో కలిసి క్రితం షాద్‌నగర్‌కు వలస వచ్చారు. కందివనం గ్రామంలో ఓ వ్యవసాయ క్షేత్రంలో సిద్ధార్థ వాచ్‌మెన్‌గా పని చేస్తూ కుటుంబంతో అక్కడే నివాసం ఉంటున్నాడు. బుధవారం వ్యవసాయ క్షేత్రంలోని నీటి ట్యాంకులో ఆయన పడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ రాంచందర్ ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

చేపలు పట్టే విషయంలో ఘర్షణ

ఇరువురిపై కేసు నమోదు

యాచారం: చెరువులో చేపలు పట్టే విషయంలో ఇరు గ్రామాల వ్యక్తుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. తక్కళ్లపల్లి-తక్కళ్లపల్లి తండా గ్రామాల మధ్యన ఉన్న చెన్నరెడ్డిచెరువులో మంగళవారం రాత్రి తండాకు చెందిన కొంత మంది గిరిజనులు చేపలు పట్టడానికి వెళ్లారు. ఇది గమనించిన కొందరు తక్కళ్లపల్లి గ్రామస్తులు చేపలు పట్టే వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. ఇరువురి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

రూ.7.50 లక్షల విలువ ఉంటుందని పోలీసుల వెల్లడి

షాద్‌నగర్‌రూరల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం సాయంత్రం ఎస్ఓటీ, షాద్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా హన్మకొండ నుంచి డీసీఎం వాహనంలో 26.2 టన్నుల రేషన్ బియ్యాన్ని నారాయణపేట జిల్లా మరికల్‌కు తీసుకెళుతున్నారు. ముందస్తు సమాచారంతో శంషాబాద్ ఎస్ఓటీ, షాద్‌నగర్ పోలీసులు మంగళవారం పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద మాటు వేసి పట్టుకున్నారు. రేషన్ బియ్యంతో పాటుగా డీసీఎంని పోలీసులు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. బియ్యం విలువ రూ.7.50 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఫరూఖ్‌నగర్ మండలం భీమారం గ్రామ పరిధిలోని మొల్లోనిగడ్డ తండాకు చెందిన పాత్లావత్ కిషన్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు డీఐ రామిరెడ్డి తెలిపారు.

జూబ్లీహిల్స్‌లో భారీ చోరీ

రూ.70 లక్షల విలువైన నగలు మాయం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లో నివసించే ప్రముఖ వ్యాపారవేత్త డీవీఎస్ సోమరాజు నివాసంలో భారీ చోరీ జరిగింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-62లోని ప్లాట్‌నెంబర్ 1242 (బి)లో సోమరాజుతో పాటు ఆయన తల్లిదండ్రులు శివరామరాజు, అన్నపూర్ణ, భార్య పద్మసూర్య కుమారి, కుమారులు యశ్వంత్ వర్మ, శివ మితీష్‌వర్మ ఉంటున్నారు. ఈ నెల 4న వీరంతా ఓ వివాహానికి హాజరై సాయంత్రం తిరిగి వచ్చిన తర్వాత ఆభరణాలను బెడ్రూంలోని అల్మరాలో భద్రపరిచారు. ఈ నెల 15న రాత్రి మరో శుభకార్యానికి వెళ్లే క్రమంలో ఆభరణాలు కోసం చూడగా అల్మరాలో కనిపించలేదు. ఇందులో 100 గ్రాముల గోల్డ్ బిస్కెట్‌తో పాటు బంగారు గాజులు, చంద్రహారం, డైమండ్ నెక్లెస్, మరో మూడు గోల్డ్ బిస్కెట్లు ఉన్నాయి. వీటి విలువ రూ.70 లక్షలు ఉంటుందని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ఇంట్లో నలుగురు పని మనుషులు ఉంటారని, ఇందులో ఇద్దరు బయటి నుంచి వస్తారని, మరో ఇద్దరు సర్వెంట్ క్వార్టర్స్‌లో ఉంటారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరిపైనే అనుమానం ఉందన్నారు. చోరీకి గురైన ఆభరణాల పక్కనే ఉన్న రూ.40 లక్షల విలువ చేసే నగలు భద్రంగానే ఉన్నాయన్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడేళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు

సాక్షి, సిటీబ్యూరో: తమిళనాడు రాజధాని చెన్నై పల్లవరం ప్రాంతానికి చెందిన యువకుడు (35) స్కిజోఫేనియా అనే మానసిక వ్యాధి ప్రభావంతో 2020లో కుటుంబానికి దూరమయ్యాడు. ఎలా వచ్చాడో ఏమో కానీ అనాథగా సికింద్రాబాద్ వీధుల్లో సంచరిస్తూ రోడ్లపై జీవించాడు. అతడిని చూసిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చలించిన మదర్ థెరిస్సా చారిటీ సంస్థకు సమాచారం ఇచ్చారు. అతడికి అక్కున చేర్చుకున్న ఆ సంస్థ ఎర్రగడ్డ మానసిక వైద్యశాల ప్రొఫెసర్ డాక్టర్ అనిత రాయిరాల సహకారంతో వైద్యం చేయించారు. ఎట్టకేలకు కోలుకున్న ఆ యువకుడు తన వివరాలు చెప్పడంతో అతికష్టమ్మీద కుటుంబీకుల వివరాలు సేకరించి సమాచారం ఇచ్చారు. బుధవారం సికింద్రాబాద్‌లోని చారిటీ కార్యాలయానికి రప్పించి యువకుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. చారిటీ కార్యాలయంలో కోలుకున్న స్థితిలో ఉన్న తమ కుమారుడిని చూసి ఉద్వేగానికి లోనయ్యారు.

ఆ కార్పొరేటర్ ఆచూకీ దొరికేనా?

నాగోలు: కార్పొరేటర్, ఓ మహిళ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన బాలవర్ధన్ కేసులో నిందితులను నాగోలు పోలీస్‌లు గతంలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఏ3గా ఉన్న గడ్డిఅన్నారం బీజేపీ కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డిపై కేసు నమోదయినప్పటినుంచి పరారీలో ఉన్నాడు. ఈ నెల 1 వ తేదీ నుంచి కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి కనిపించకుండా అజ్ఞాతంలోకి వెళ్లాడు. దీంతో నాగోలు పోలీసులు అతని కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. పోలీసులు పై స్థాయి అధికారులకు సమాచారం ఇచ్చారు. నాగోలు పోలీసులుతో పాటు ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. వారి కుటుంబ సభ్యులను, ఇతర స్నేహితుల ద్వారా కార్పొరేటర్ ఆచూకీ కోసం పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

రోగాలను ప్రాథమిక స్థాయిలో గుర్తించాలి

డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

శంషాబాద్: ఎలాంటి అనారోగ్య లక్షణాలు కనిపిస్తున్నా పరీక్షల ద్వారా ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే సరైన చికిత్సతో మేలు జరుగుతుందని ఏఐజీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి సూచించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు సీఐఎస్ఎఫ్ డీజీపీ శ్యామల ఆధ్వర్యంలో సుమారు 200 మంది సీఐఎస్ఎఫ్ ఉద్యోగులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమంతో వైద్యపరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీర్ణ సంబంధిత వ్యాధులను ఎలా గుర్తించాలనే విషయాలను వివరించారు. జీవనశైలితో వచ్చే కాలేయ సంబంధిత వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించే మంచి చికిత్స అందుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సీఐఎస్ఎఫ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

హోదా ఉన్నా.. నిఘా సున్నా!


టాస్క్‌ఫోర్స్ కార్యాలయం

- హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్‌కు పోలీస్ స్టేషన్ హోదా
- 1996లోనే జీవో జారీ చేసిన అప్పటి ప్రభుత్వం
- 'సుప్రీం' ఆదేశాల ప్రకారం ఠాణాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి
- ఇప్పటి వరకు ఈ విభాగంలో ఏర్పాటు చేయని అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: నేరగాళ్ల కోసం దేశ వ్యాప్తంగా వేట.. నకిలీ కరెన్సీ కేసుల్లో సరిహద్దుల ఆవలి వరకు ప్రయాణం.. ఉగ్రవాద కేసుల్లో ఫీల్డ్ ఆపరేషన్లు.. కేవలం ఇవేనా..? నగర వ్యాప్తంగా ఎలాంటి సంచలనాత్మక నేరం చోటు చేసుకున్నా అందరికీ గుర్తొచ్చిన పేరు హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్. ఇలాంటి ఘన చరిత్ర ఉన్న ఈ విభాగం ప్రతిష్ట ఇటీవల వరుసగా వెలుగులోకి వస్తున్న వివాదాస్పద అంశాలతో మసకబారుతోంది. అక్రమ ఫోన్ ట్యాపింగ్, బెదిరింపు వసూళ్లు, ఎన్నికల డబ్బు రవాణా, వ్యాపారుల కిడ్నాప్-బెదిరింపులు.. ఇలా అనేక వివాదాలు ఈ విభాగాన్ని చుట్టుముడుతున్నాయి. గడిచిన కొన్నేళ్లుగా ఈ పరిస్థితుల నెలకొనడానికి నగరంలోని రెండు టాస్క్‌ఫోర్స్ కార్యాలయాల్లో సరైన నిఘా లేకపోవడమూ ఓ కారణంగా నిలుస్తోంది.

సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం..

కస్టోడియల్ మరణాలకు చెక్ చెప్పడం, మానవ హక్కుల ఉల్లంఘనలు లేకుండా చూడటం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా ఉంచడం, అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు పోలీసింగ్‌లో పూర్తి పారదర్శకత కోసం ప్రతి పోలీసు స్టేషన్‌లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు దాదాపు పదేళ్ల క్రితం ఆదేశాలు జారీ చేసింది. డీకే బసు వర్సస్ స్టేట్ ఆఫ్ వెస్ట్ బెంగాల్ కేసులో తీర్పు ఇస్తూ దీనికి సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. పలుమార్లు గడువు పెంచిన పోయిన సుప్రీం కోర్టు 2020 డిసెంబర్‌ను తుది గడువుగా నిర్దేశించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించింది. పని చేస్తున్నాయా? లేదా? అనేది పక్కన పెడితే నగరంలోని ప్రతి పోలీసుస్టేషన్‌లోనూ కనిష్ఠంగా 11 కెమెరాలు ఏర్పాటయ్యాయి. కేవలం పోలీసుస్టేషన్‌లో మాత్రమే కాదు.. ఠాణా హోదా ఉన్న సీసీఎస్, సైబర్ క్రైమ్ పీఎస్‌ల్లోనూ ఇవి ఉన్నాయి.

28 ఏళ్ల క్రితమే పోలీసుస్టేషన్ హోదా..

హైదరాబాద్ పోలీసు కమిషనర్ అధీనంలో పని చేసే కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్‌కు దశాబ్దాల చరిత్ర ఉంది. ఒకప్పుడు ఇది కేవలం యాంటీ గూండా స్క్వాడ్ మాదిరిగా కేవలం ఆపరేషనల్ విభాగంగా ఉండేది. కాలక్రమంలో చోటుచేసుకున్న పరిణామాలు, పోస్టులు పొందటంలో, జీతభత్యాల విషయంలో వస్తున్న సాంకేతిక సమస్యల నేపథ్యంలో 1996లో అప్పటి పోలీసు శాఖ ప్రభుత్వానికి కీలక నివేదిక పంపింది. దీని ఆధారంగా సర్కారు కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్‌కు సైతం పోలీసుస్టేషన్ హోదా ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే కొన్నేళ్లుగా నెల వారీ నిర్వహణ ఖర్చులు కూడా దీనికి వస్తున్నాయి. ఇలా దాదాపు 28 ఏళ్లుగా ఠాణా హోదా ఉన్న టాస్క్‌ఫోర్స్ కార్యాలయాలు (సికింద్రాబాద్‌లో ఒకటి, పాతబస్తీలో మరోటి) సీసీ కెమెరాలు లేకుండానే కాలం గడిపేస్తున్నాయి. అన్నింటిలోనూ ఏర్పాటు చేయకుండా ప్రతి పోలీసుస్టేషన్‌లోనూ సీసీ కెమెరాలు ఉన్నాయంటూ నివేదిక ఇవ్వడం కచ్చితంగా కోర్టు ధిక్కరణ కిందికే వస్తుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. నిఘా నేత్రాలు నేరాల నియంత్రణలో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చాలా కేసుల్లో నిరూపితం అయింది.

ఫిర్యాదు చేసే విధానానికీ స్వస్తి..

టాస్క్‌ఫోర్స్ విభాగం కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తే దానిపై పని భారం పెరిగి, ఫలితాలు దెబ్బతింటాయనే వాదన ఉంది. దీన్ని అంగీకరించినప్పటికీ.. సీసీ కెమెరాల ఏర్పాటుకు ఉన్న ఇబ్బందులు ఏంటనేది మాత్రం అంతు చిక్కట్లేదు. మరోపక్క టాస్క్‌ఫోర్స్ విభాగం పట్టుకునే నేరగాళ్లపై నమోదయ్యే వాటిలో అత్యధికం సుమోటో కేసులే. అంటే.. పోలీసులే ఫిర్యాదుదారుడిగా ఉంటారు. ఓ నేరగాడిపై సమాచారం అందుకుని, వలపన్ని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారే సంబంధిత పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తుండేవారు. దీనివల్ల భవిష్యత్తులో సాక్ష్యం చెప్పడం వంటివి తప్పనిసరి కావడంతో ఈ విభాగం అధి కారుల్లో జవాబుదారీతనం ఉండేది. 2015 నుంచి ఈ విధానం పూర్తిస్థాయిలో, పక్కాగా అమలు కావట్లేదు. నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న వాటినీ స్థానిక పోలీసులకు అప్పగించి చేతులు దులుపుకొంటున్న సందర్భాలూ అనేకం ఉంటున్నాయి. ఈ కేసుల్లో ఆయా ఠాణాల అధికారులే ఫిర్యాదు చేస్తూ సుమోటో కేసులు నమోదు చేయిస్తున్నారు. ఈ కారణాలే టాస్క్‌ఫోర్స్ అభాసుపాలు కావడానికి మూలం అనే వాదన బలంగా వినిపిస్తోంది.

ఓయూలో టెక్నోస్మానియా సందడి


విద్యార్థుల గ్రూప్ డ్యాన్స్

ఉస్మానియా యూనివర్సిటీ: టెక్నాలజీ కాలేజీ విద్యార్థుల ఆధ్వర్యంలో టెక్నోస్మానియా-2024 జాతీయ స్థాయి టెక్నోకల్చరల్ ఫెస్ట్‌తో ఓయూ క్యాంపస్‌లో సందడి వాతావరణం నెలకొంది. బుధవారం వర్సిటీ ప్రవేశ ద్వారం ఎన్‌సీసీ గేటు వద్ద 'నీటి చుక్కను పొదుపుగా వాడుదాం.. ప్రొటెక్ట్ ఎర్త్ ప్రిషియస్ వాటర్' నినాదంతో ఏర్పాటు చేసిన 3కే రన్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.చింత సాయిలు, టెక్నోస్మానియా కన్వీనర్ ప్రొ.శ్రీనునాయక్ జెండా ఊపి ప్రారంభించారు. రేణుకా ఎల్లమ్మ టెంపుల్ వద్ద ఏర్పాటు చేసిన జూక్ బాక్స్ మ్యూజిక్‌కు ఒకేసారి వందలాది మంది విద్యార్థులు సామూహిక నృత్యంతో అలరించారు. అనంతరం కాలేజీ ఎదుట విద్యార్థులు చేసిన బైక్ స్టంట్ చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. రమేష్‌కుమార్, ప్రొ.వీవీ బసవరావు, ప్రొ.రాజం, కోర్డినేటర్ డా.పరశురామ్, డా.సాదం ఐలయ్య, డా.వి భాస్కర్, డా.శ్రీనివాసులు, స్టూడెంట్స్ కోఆర్డినేటర్లు శ్యామ్ సుందర్, మాధవి, ఆకాష్, అఖిల, ముఖేష్, సాహిత్య, సూరిదుర్గ, అరవింద్ పాల్గొన్నారు.